సప్లిమెంటరీ పరీక్షలకు హాల్ టిక్కెట్లు సిద్ధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 19 నుంచి 28 వరకు జరుగనున్న టెన్త్ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షకు హాల్ టిక్కెట్లు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. ప్రధానోపాధ్యాయులంతా తమ స్కూల్ లాగిన్ లో విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పొందేందుకు 9552300009కు HI అని టైపు చేసి, చూజ్ సర్వీసు లేదా 'సేవను ఎంచుకోవాలని తెలిపారు. తదుపరి ఎడ్యుకేషన్ సర్వీస్ లేదా విద్యా సేవలు సర్వీస్ ను సెలెక్ట్ చేసి'ఎస్ ఎస్ సి హాల్ టికెట్' ను సెలెక్ట్ చేసి విద్యార్థి అప్లికేషను నెంబర్/ చైల్డ్ ఐడి,పుట్టిన తేదిచ స్ట్రీమ్ ను సెలెక్ట్ చేసి కన్ఫర్మ్ చేసి హాల్ టికెట్ ను పొందవచ్చునని తెలిపారు.

సహకరించని సర్పంచులకు నోటీసులు

- వనరులన్నీ సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళిక
- డిఆర్‌సి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత
- దుకాణాల్లో నాసిరకం మద్యం
- ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో చెరువుల్లో రోడ్లు
- నిధుల్లేక సాగునీటి కాలువలు అధ్వానం
- గోడువెలిబుచ్చిన ఎమ్‌పి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పారిశుధ్య నిర్వహణకు సహకరించని సర్పంచులకు నోటీసులు ఇవ్వాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. జిల్లాలోని వనరులన్నీ సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికార యంత్రాంగానికి సూచించారు. మద్యం దుకాణాల్లో నాశిరకం మద్యాన్ని విక్రయిస్తున్నారని, ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో చెరువుల్లో రోడ్లు నిర్మిస్తున్నారని, పలు చోట్ల రెవెన్యూ అధికారుల అండతో రియల్ ఎస్టేటర్లు ఆక్రమించుకుని లేఅవుట్లు వేస్తున్నారని, నిధులు లేక జలాశయాలు, సాగునీటి కాలువల నిర్వహణ ఆధ్వానంగా మారిందని ఎమ్మెల్యేలు, ఎంపి, ఎమ్మెల్సీలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బొబ్బిలి ప్రాంతంలోని మద్యం దుకాణాల్లో నాశిరకం మద్యం విక్రయిస్తున్నారని, బార్లలో మాత్రం బ్రాండెడ్ మద్యం అమ్ముతున్నారని స్థానిక ఎమ్మెల్యే బేబినాయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మంత్రి అనిత అధ్యక్షతన డిఆర్‌సి సమావేశం కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు, ఎంపి, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. సమావేశంలో ఆర్ అండ్ బి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, వ్యవసాయశాఖ, పంచాయితీరాజ్, నీటి పారుదల, గ్రామీణ ఉపాధి హామీ, గృహ నిర్మాణం, విద్యుత్, పౌర సరఫరాలు తదితర శాఖలకు చెందిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను వచ్చే సమావేశాల్లో తెలియజేయాలని ఆదేశించారు. ఇకనుంచీ నెలనెలా డిఆర్‌సి నిర్వహిస్తామని ప్రకటించారు. సమావేశంలో అనిత పలు కీలక నిర్ణయాలు చేశారు. గ్రామ పంచాయతీల వద్ద నిధులు పుష్కలంగా ఉన్నాయని, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణకు సహకరించని సర్పంచులకు నోటీసులు అందజేయాలని డిపిఒను మంత్రి అనిత ఆదేశించారు. అప్పటికీ దారికి రాకపోతే చర్యలు తీసుకునేందుకు వెనుకాడద్దని సూచించారు. పనితీరు బాగోలేనందున డ్వామా మెరకముడిదాం ఎపిఒ శ్రీనివాస్‌ను సరెండర్ చేయాలని, సివిల్ సప్లైయ్ పూర్వ డిఎంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని, దీనికోసం సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరించాలని మంత్రి చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్టు భూసేకరణకు సంబంధించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కమిటీ వేయాలని మంత్రి ఆదేశించారు. చెరకు రైతుల సమస్యల పరిష్కారానికి, రెవెన్యూ శాఖకు సంబంధించి అంశాలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తామని చెప్పారు.

విజయనగరం ఎంఎల్ఎ అదితి విజయలక్ష్మి సూచన మేరకు భూగర్భ జలాల మట్టాన్ని పునఃపరిశీలించాలని మంత్రి ఆదేశించారు. తమ నియోజకవర్గంలో రహదారుల మరమ్మతు పూర్తి కాలేదని రాజాం ఎంఎల్ఎ కోండ్రు మురళీమోహన్, నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగమాధవి, బొబ్బిలి ఎంఎల్ఎ బేబి నాయన మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని వారంతా ఏకోన్ముకంగా తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అక్రమ కట్టడాలకు విద్యుత్ కనక్షన్లు ఇవ్వకూడదని సూచించారు. బోర్లు మరమ్మతులు వేగంగా జరగడం లేదని ఎంఎల్‌సి డాక్టర్ సురేష్‌బాబు చెప్పారు. కొత్తవలసలో చెరువులో అక్రమంగా రహదారిని నిర్మిస్తున్నారని, రేగ పుణ్యగిరి, దారపర్తి తదితర గిరిజన ప్రాంతాలకు రహదారుల నిర్మాణం నిలిచిపోయిందని ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో ఈ సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబద్కర్ అన్నారు. ఉపాధిహామీ కింద చెక్‌డ్యామ్‌లు, పాఠశాలలకు ప్రహరీ గోడలు మంజూరు చేయాలని, గ్రామాల్లో చెత్త సమస్య ఎక్కువగా ఉందని, మద్యం షాపులవద్ద వాడిన ప్లాస్టిక్ గ్లాసులను చెరువుల్లో పడేసి కలుషిత చేస్తున్నారని ఎంఎల్ఎ లోకం నాగమాధవి తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా ఫైర్ ఆడిట్ నిర్వహించి, నెల రోజుల్లోగా నివేదిక అందజేయాలని కలెక్టర్‌ను మంత్రి అనిత ఆదేశించారు. షాపింగ్ మాల్స్, సినిమా హాళ్లు, అపార్ట్ మెంట్లు, విద్యా సంస్థలు తదితర అన్ని రకాల సంస్థలను తనిఖీ చేయాలని ఆమె సూచించారు.

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో జిల్లా కేంద్రాస్పత్రిలో ఓపి సేవలు గణనీయంగా మెరుగుపడ్డాయని, పరికరాల కొరత కారణంగా కొన్ని కేసులను విశాఖ తరలించాల్సి వస్తోందని చెప్పారు. ఎంఎల్ఎ అదితి మాట్లాడుతూ, సర్వజన ఆసుపత్రిలో బెడ్‌ల సమస్య కారణంగా ఒకే పడకపై ఇద్దరు రోగులను ఉంచాల్సిన పరిస్థితి వస్తోందని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, ఆసుపత్రి భవనంలో ఉన్న డిసిహెచ్ఎస్ కార్యాలయాన్ని తక్షణమే కలెక్టరేట్‌కు తరలించాలని ఆదేశించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్, డిగ్రీ కళాశాల నిర్మాణాన్ని ప్రారంభించాలని ఎంఎల్ఎ అదితి కోరారు. రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి మాట్లాడుతూ, జిల్లా జైలును నిర్మించాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రాన్ని కూడా సమర్పించారు. నీటి పారుదల అంశంపై చర్చిస్తూ, కాలువలు, ప్రాజెక్టుల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. రేషన్ కార్డుల సవరణ ప్రక్రియపై చర్చ జరిగింది. మ్యారేజ్ సర్టిఫికేట్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని జెడ్‌పి ఛైర్మన్ చెప్పగా, ఈ నిబంధనను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. నాణ్యమైన మద్యాన్ని బార్లకు తరలించి, నాశిరకం మద్యాన్ని షాపుల్లో విక్రయించాలని, దీనిని నివారించాలని ఎంఎల్‌ఏ బేబి నాయన కోరారు. సమావేశంలో ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, జెసి ఎస్.సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, సిపిఒ పి.బాలాజీ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంకిలి సుగర్స్‌పై స్పష్టత ఇవ్వండి : జెడ్‌పి చైర్మన్

సంకిలి చక్కెర కర్మాగారాన్ని మూసి వేస్తారని ప్రచారం జరుగుతోందని, దీనిపై స్పష్టమైన వివరణ ఇచ్చి రైతులకు భరోసా కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఫ్యాక్టరీ మూసివేస్తారన్న ప్రచారంతో రైతులు ఇప్పటికే ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఈ విషయం అసలు ప్రభుత్వం దృష్టిలో ఉందా? లేదా? అని ప్రశ్నించారు. దీనిపై సమాచారం తీసుకుని, మంత్రి సమక్షంలో సమావేశమౌతామని కలెక్టర్ సమాధానం చెప్పారు. సర్వ జన ఆసుపత్రిలో ఏయే సేవలు అందుబాటులో ఉన్నాయి? ఏ సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదో ప్రజలకు ప్రభుత్వం తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి సమాచారం లేకపోవడం వల్ల రోగులు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ కేసులను కెజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఆర్‌ఎస్‌కెలు, పిఎసిఎస్‌ల ద్వారా ఎక్కువ ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. లేదంటే ప్రైవేటు డీలర్ల హవా పెరిగిపోతుందని, రైతులు అవస్థలు పడతారని అన్నారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ కనక్షన్లు ఇచ్చేటప్పుడు ఎదురవుతున్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన అందరికీ కనక్షన్లు మంజూరు చేయాలని అన్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రి నుంచి కేసులను ఎక్కువగా కెజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారని, దీనిని నివారించి ఇక్కడే వైద్యం అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునఃవ్యవస్థీకరణ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని, ఉపాధ్యాయ బదిలీలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అంతకుముందు జిల్లాకేంద్రాస్పత్రి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ జీఓ 117ను రద్దు చేసి దాని స్థానే కొత్త జీఓ విడుదల చేసి దాని ఆధారంగా మాత్రమే పాఠశాలలను పునఃవ్యవస్థీకరించాలని అన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. అన్ని మోడల్ ప్రైమరీ స్కూళ్లలో 5 తరగతులు బోధించడానికి ఐదుగురు టీచర్లను నియమించాలని, విద్యార్థుల సంఖ్య 75 మించితే పిఎస్, హెచ్‌ఎం.పోస్టు అదనంగా కేటాయించాలన్నారు. విద్యార్థుల సంఖ్య 120 మించితే 6వ ఎస్‌జిటి, ఆ పైన ప్రతి 30 మందికి ఒక ఎస్‌జిటి చొప్పున కేటాయించాలన్నారు. ఉర్దూ, మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్‌జిటి, ఎస్‌ఎలతో కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. ఆ పోస్టులు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల స్థాయిని దిగజార్చవద్దన్నారు. వారిని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మాత్రమే నియమించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియంను కొనసాగించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తరగతి రోల్ 45 మించినపుడు రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలని, తదనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలనీ డిమాండ్ చేశారు. హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 300 దాటిన చోట రెండవ పీడీ పోస్టు కేటాయించాలన్నారు. బదిలీల జీఓ తక్షణమే విడుదల చేసి వేసవి సెలవుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. బదిలీల ప్రక్రియకు ముందే ప్లస్ టూ హైస్కూళ్లలో ఇంటర్మీడియట్ తరగతులు బోధించడానికి అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్టుల్లో కూడా అర్హులైన ఎస్‌జిటిలకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులలో ఉన్న ఆందోళన గమనించి సమస్యలను తమతో చర్చించి సత్వరమే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో యు టిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెవిఆర్ కె ఈశ్వరరావు, రమేష్ చంద్ర పట్నాయక్, మీసాల అప్పలనాయుడు, తిరుపతిరావు, జి.నిర్మల, శశికళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత డిఇఒ కృష్ణారావు మృతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి గుణుపూరు కృష్ణారావు సోమవారం మృతిచెందారు. బొబ్బిలి పట్టణంలోని మల్లమ్మపేట ఆయన సొంతూరు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో విశాఖలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఆయన తుదిశ్వాస విడిచారు. జిల్లా విద్యాశాఖాధికారిగా ఆయన ఎన్నో సమస్యలను సౌమ్యంగా పరిష్కరించారు.

ఈదురుగాలుల బీభత్సం

నేలకొరిగిన అరటి

వసాది సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని సోమవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. కొండతామరపల్లి జంక్షన్ నుంచి శృంగవరపుకోట వెళ్లే మార్గంలో వసాది గ్రామ సమీపంలో రోడ్డుకు మధ్యలో చెట్టు రోడ్డుపై పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మదనాపురం, మధుపాడ గ్రామాల్లో ఈదురు గాలుల ప్రభావంతో అరటితోటలు నేలకొరిగాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందనేది తెలియ రాలేదు.

శృంగవరపుకోట : మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. పట్టణంలో ప్రధాన రహదారిపై వర్షపునీరు చేరడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విశాఖ - అరకు రహదారిలో రోడ్డు మార్జిన్ ఆక్రమించి కాలువలపై వ్యాపారులు నిర్మాణాలు చేపట్టడం, మురుగునీటి కాలువలు చెత్తా చెదారాలతో పూడుకుపోవడంతో నీరంతా రోడ్లపై ప్రవహించింది. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే సమస్య.., అయినప్పటికీ పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మా సమస్యలను పరిష్కరించండి

- పిజిఆర్‌ఎస్‌కు 136 అర్జీలు
- వినతుల్లో అగ్రస్థానం రెవెన్యూ శాఖదే

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌లో అధికారులకు పలువురు వినతులు అందజేశారు. కార్యక్రమంలో మొత్తం 136 అర్జీలు అందాయి. వాటిని జిల్లా కలెక్టర్ అంబేద్కర్, జెసి సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, కె.ఆర్.సి ఎస్‌డిసి మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజు పరిశీలించారు. ఆయా సమస్యలను వీలైనంత వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈవారం మొత్తం 136 అర్జీలు అందగా, వీటిలో 75 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నాయి.

.నెల్లిమర్ల మండలం గొర్లిపేటలో చింతల చెరువు, కొండల చెరువు లను కొంతమంది అక్రమించారని దాని వలన చెరువు కింద ఉండే పాడిపంటలకు నీరు లేక పంటలు పోతున్నాయని కలెక్టర్ కు గ్రామస్తులు విన్నవించారు. గుర్ల మండలం దేవుని కనపాక గ్రామంలో ఎక్స్ ఆర్మీ కుటుంబాల నుంచి 8.06 ఎకరాల భూమిని కొన్నామని, ప్రస్తుతం అభూమి డి-పట్టాగా ఉందని, మా భూమి మాకు అప్పగించాలని గేదెల సత్యవతి అనే మహిళ కోరారు. ఇదే గ్రామానికి చెందిన కొంతమంది గిరిజనులు 9.05 ఎకరాల భూమిని 30 ఏళ్ల నుంచి సాగు చేస్తున్నామని, ఆ భూమిని గ్రామానికి చెందిన కె.శ్రీను అనే వ్యక్తి రాజకీయ పలుకుబడితో దౌర్జన్యం గా లాక్కొంటున్నారని గిరిజనులు ఫిర్యాదు చేశారు. గ్రామీణ ఉపాధి హామీ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని వినతి అందజేశారు.

వినతులు స్వీకరించిన ఎస్‌పి

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్‌జిందాల్ ప్రజల నుంచి 46 ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, సమస్యలను వివరించి, చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె.చౌదరి, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తైక్వాండో జాతీయ సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన రాజీవ్ ఇండోర్ స్టేడియంలో 3వ జాతీయ స్థాయి తైక్వాండో స్పారింగ్ టెక్నిక్ సెమినార్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. సెమినార్ కు ఆంధ్ర, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తంగా 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్ రావు , ఈ సెమినార్‌కు కోచ్‌గా ఇరాన్ దేశం నుంచి అబ్బాస్ షేక్ అనే వరల్డ్ ఛాంపియన్ షిప్ ప్లేయర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం ఈనెల 15 వరకు నిర్విరామంగా జరుగుతుంది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌కె పురుషోత్తం, తెలంగాణ తైక్వాండో రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి కె .శ్రీహరి , వైస్ ప్రెసిడెంటు, నాయబ్ రసూల్ , జాయింట్ సెక్రటరీ జగన్ మోహన్ రావు, ఇసి మెంబర్లు శ్రీనివాసులు, సాయిబాబా పాల్గొన్నారు.

పీపుల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక సేవలు అందిస్తూ, సమాజానికి తమవంతు సాయం చేయడమే ప్రధాన లక్ష్యమని పీపుల్స్ కో- ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఎ.ఎల్లారావు అన్నారు. సోమవారం రాజాబజార్, కోట జంక్షన్ వద్ద 24వ శాఖను శ్రీ కష్ణా బజాజ్ షోరూమ్ అధినేత ఎం.సుధాకర్ రిబ్బను కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విజయనగరంలో నమ్మకమే పెట్టుబడి గా సంస్థలు వ్యాపారాలు చేస్తున్నాయని, ఈ సంస్థ కూడా ప్రజలకు ప్రయోజనం కలిగించే విధంగా వుండాలని చెప్పారు. లాకర్ స్ట్రాంగ్ రూమ్‌ను సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ చుక్కపల్లి అరుణ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్యాష్ కౌంటర్‌ను మాచర్ల చంద్రశేఖర్ గుప్త, బ్రాంచ్ మేనేజర్ ఛాంబర్‌ను చార్టెడ్ అకౌంటెంట్ మడిపల్లి రామారావు, కాన్ఫరెన్స్ హాల్ ను సన్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రారంభించారు.

డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలి

- కోట జంక్షన్ వద్ద మానవహారం
- 14న చలో కలెక్టరేట్‌కు డివైఎఫ్ఐ పిలుపు

మానవహారం చేస్తున్న నిరుద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి అభ్యర్థులకు జిల్లాకు ఒక పేపర్ విధానం పెట్టాలని, వయోపరిమితి 47 పెంచాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం మానవహారం చేపట్టారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ సుమారు ఏడేళ్ల తరువాత వచ్చిన నోటిఫికేషన్‌లో నిరుద్యోగులు సన్నద్ధంకావడానికి కనీసం 90 రోజులు సమయం లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణ మాదిరి వయో పరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్‌చేశారు. జిల్లాకు ఒకే పేపర్ నిర్వహించాలని అన్నారు. ఓపెన్ డిగ్రీలో పాస్ అయిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి టెక్నికల్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 14న కోట జంక్షన్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ, ధర్నా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌సి అభ్యర్థులు భాను, ఈశ్వర్ రావు,శ్రీను, కిషోర్ , రవి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన వారికేనా రుణాలు?

ఎంపిడిఒపై టిడిపి నాయకుల ఆగ్రహం

ఎంపిడిఒతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని జనసేన పార్టీ వారికేనా రుణాలు ఇచ్చేది? టిడిపి కార్యకర్తలకు ఇవ్వరా అని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భవానిపై టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, డెంకాడ పిఎసిఎస్ మాజీ చైర్మన్ ప్రతిప్‌రాజు ఆధ్వర్యంలో కొంతమంది టిడిపి నాయకులు కార్యకర్తలు సోమవారం ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చి ఎంపిడిఒ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ లోన్స్ ఇవ్వాలని నోటిఫికేషను ఇవ్వడంతో 570 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 85 మందిని అర్హులుగా గుర్తించి మండల పరిధిలో ఉన్న బ్యాంకులకు పంపించారని చెప్పారు. మొత్తం అర్హులంతా జనసేన పార్టీ వారే తప్ప టిడిపికి చెందిన ఒక్క కార్యకర్తకు కూడా రుణం రాలేదని ఆరోపించారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జ్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి టిడిపి నాయకులకు సమాచారమివ్వాలని చెప్పినా అధికారుల్లో మార్పు రాలేదన్నారు. ఎమ్మెల్యే సుప్రీమ్ అని ఎమ్మెల్యే చెప్పిందే చేస్తానని ఎంపిడిఒ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పొత్తులో భాగంగా జనసేనకు 45 టిడిపి వారికి 45 బీసీ లోన్స్ ఇవ్వాలని కానీ ఇక్కడ మొత్తం లోన్స్ అన్నీ జనసేన పార్టీకి చెందిన వారికే ఇవ్వడం దారుణమన్నారు. ముఖ్యంగా మండలంలోని అక్కివరం గ్రామంలో 21 మందికి బీసీ లోన్స్ మంజూరు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఎంపిడిఒ బీసీ లోన్స్ విషయంలో టిడిపి వారికి న్యాయం చేయకపోతే తగు మూల్యం చెల్లించుకోవడం తప్పదని హెచ్చరించారు. టిడిపి వారికి న్యాయం చేయకపోతే మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో కార్యకర్త నాయకులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సిహెచ్ పద్మావతి, చీకటి సుహాసిని, కోరాడ రమణ, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం

మెగా జాబ్‌మేళాలో మంత్రి కొండపల్లి

శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి

ప్రజాశక్తి-గజపతినగరం

యువతకు 20 లక్షల ఉద్యోగాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. గజపతినగరం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను మంత్రి శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ధ్రువపత్రాలను అందజేశారు. పదోతరగతిలో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దీనికోసం మెగా జాబ్‌మేళాలను ఏర్పాటు చేస్తున్నామని, యువతకు నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంటికో వ్యాపారవేత్తను తయారు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామిక, వ్యాపార వృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో భారీ స్థాయిలో ఐటి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఉత్తరాంధ్రలో ఫార్మా క్లస్టర్, పెట్రో కెమికల్స్ పరిశ్రమలు, స్టీలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. రెండు మూడేళ్లలో ఇవన్నీ కార్యరూపం దాలుస్తాయన్నారు. యువత తక్కువ జీతమైనా సరే, తమకు ముందు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అనుభవాన్ని సంపాదించాలని సూచించారు. అనుభవం వస్తే మంచి జీతాన్ని డిమాండ్ చేసే అవకాశం కలుగుతుందని చెప్పారు. అందువల్ల జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అధికారి జి.ప్రశాంత్‌కుమార్, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఆర్‌డిఒకు వినతి అందిస్తున్న గిరిజనులు, సిపిఎం నాయకులు

మారికను అదానీకి అప్పగించొద్దు

ఆర్‌డిఒని కలిసిన పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి-వేపాడ

మారిక గ్రామానికి అదానీ కంపెనీకి అప్పగించొద్దని కోరుతూ మారిక పోరాట కమిటీ ఆధ్వర్యాన గిరిజనులు ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ప్రమీలగాంధీకి సోమవారం వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో భూసేకరణ, సామాజిక అధ్యయనం కోసం నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న తమకు ప్రభుత్వ సహాయం అందక పోయినా ప్రకృతి వనరులతోనే సహవాసం చేస్తున్నామని చెప్పారు. అదానీకి చెందిన హైడ్రో పవర్ ప్రాజెక్టుకు తమ భూములను ధారాదత్తం చేస్తే అంగీకరించేది లేదని తెగేసి చెప్పారు. మారిక కొండపై ఉన్న పచ్చని పంట పొలాలు, పర్యావరణం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. అదానీకి అప్పగించే ప్రయత్నాలు గాని, సామాజిక అధ్యయనం గాని చేయవద్దని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. గిరిజనుల భూములను అదానీ కంపెనీకి అప్పగించే ప్రయత్నాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్, పోరాట కమిటీ అధ్యక్షులు జలారి వీర్రాజు, సహాయ కార్యదర్శి గెమ్మెల అప్పలనాయుడు, నాయకులు గమ్మెల వెంకట్రావు, శ్రీను, బుజ్జి, బెబ్బులి గణేష్, పాతబోయిన దేవుడు, పాతబోయిన దేవుడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం ఆమోదం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేష్ కుమార్ జీవో 419 సోమవారం విడుదల చేశారు. జీవోను ఎన్నికల అధికారి రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మికు పంపించారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి మున్సిపల్ చైర్మన్‌గా మురళీకు హోదా ఉండదు. మున్సిపల్ చైర్మన్ హోదా నుంచి మురళీను తొలగించడంతో నూతన చైర్మన్ ఎన్నికకు జీవో విడుదల కావాల్సి ఉంది.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తం

ప్రజాశక్తి-కొత్తవలస

వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నాయని వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తం కావాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు గోపాలకృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని ముసిరాం గ్రామంలో వేసవిలో వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా డీహైడ్రేషన్ రాకుండా మజ్జిగ, నిమ్మరసం, బార్లీ, కొబ్బరి నీళ్లు, ఒఆర్ఎస్. ద్రావణం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం ఒఆర్ఎస్ పాకెట్స్, తల నొప్పి, జ్వరం, వాంతులు, విరోచనాలకు ఫస్ట్ ఎయిడ్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎస్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, ఎఎన్ఎం గౌరి, ఆశావర్కర్ రేవతి, అంగన్వాడీ వర్కర్ శ్యామల, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తహశీల్దార్ అరుణకుమారి తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కోటి బాబు, యూనిట్ ఇన్‌ఛార్జి కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి వేతనం గిట్టుబాటుకు చర్యలు

ప్రజాశక్తి - వంగర

ఉపాధి హామీ కూలీలకు వేతనం రూ.307 గిట్టుబాటు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఎస్ రఘునాథచారి అన్నారు. ఉపాధి హామీ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పూటలా పని చేసే విధంగా చూడాలని, పని చేసే చోట తాగునీరు, చలువ పందిర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ సత్యవతి ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న ఉద్యోగోన్నతుల్లో ఎస్‌సి వర్గీకరణ అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు, పంచాయతీ అధికారికి వినతి అందజేశారు. పంచాయతీ శాఖలో గ్రూప్ 4,5 ఉద్యోగుల ప్రమోషన్లలో ఎస్‌సి వర్గీకరణ రిజర్వేషన్ అమలు చేయాలనీ కోరారు.కార్యక్రమంలో ఎంఇఎఫ్ అధ్యక్షులు పెంకి ఇజ్రాయెల్ ,ప్రధాన కార్యదర్శి యందవ పైడితల్లి, గర్భాపు వరప్రసాద్, గౌరవాధ్యక్షులు దిలీప్ కుమార్, గర్భాపు రామారావు తదితరులు పాల్గొన్నారు

విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి-తెర్లాం

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలని తెర్లాం శాఖా గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి కోరారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ, అబ్దుల్ కలాం, మదర్ తెరిసా, బెజవాడ గోపాలరెడ్డి చరిత్రలను విద్యార్థులతో చదివించారు.

అడ్డగోలు రిజిస్ట్రేషన్లపై ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

మధురవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అప్పటి సబ్ రిజిస్టర్ రోషన్ కుమార్ అడ్డగోలుగా చేసిన రిజిస్ట్రేషన్‌లపై విశాఖ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ డిఐజితో పాటు జిల్లా రిజిస్ట్రేషన్ల అధికారికి బాధితులు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని కొలువాడ రెవెన్యూ పరిధిలోని భూములను వేరొకరి పేరు మీద వన్ బి ఉంటే మరొకరి పేరు మీద భూములు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తూడెం గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే లోకం మాధవికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా బాధితులు విశాఖ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డిఐజీ బాలకృష్ణ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలోని సిబ్బందికి ఫిర్యాదు చేశారు. జిల్లా రిజిస్టర్ ఉపేంద్రరావుకు ఫిర్యాదు చేయడంతో ఆయన వెంటనే స్పందించారు. ఈ రిజిస్ట్రేషన్‌లపై జరిగిన విధానంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని రిజిస్టర్ తెలిపారని బాధితులు తెలిపారు. అడ్డగోలుగా జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్లు రద్దు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. .

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు.. సోమవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కబుర్లు చెప్పుకుంటూ ఆటపాటలతో అందరూ ఆనందంగా గడిపారు. భవిష్యత్తులో పూర్వ విద్యార్థులంతా కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధి ముత్యాలనాయుడు తెలిపారు. ఇందులో భాగంగా విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తామన్నారు.

సార్వత్రిక సమ్మెలో పాల్గొనండి

మైన్స్ కార్మికులకు సిఐటియు నాయకులు పిలుపు

ప్రజాశక్తి-గరివిడి

లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనాలు అమలు, స్కీం వర్కర్స్, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మూడోరోజు జీపు జాత గరివిడి మండలంలోని బ్రిడ్జి వద్ద ప్రారంభమైంది. డి ఎఫ్ఎన్ మైన్స్ వద్ద కార్మికులతో జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉపాధ్యక్షులు టివి రమణ మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాల, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం తదితర కోర్కెలపై మే 20న సమ్మె చేయాలని కార్మిక, ఉద్యోగ సంఘాలు పిలుపు నిచ్చాయని తెలిపారు. సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గౌరినాయుడు, బి.సుధారాణి, విశ్వనాథరాజు, పాపినాయుడు, అప్పలనాయుడు, రమణ, గౌరీ, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కార్యదర్శి పి.శంకరరావు, కె.సురేష్, టి.వి. రమణ, బి.సుధారాణి, ఎ.జగన్ మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ జీపు జాతా నిర్వహించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం, కనీస వేతనాలు అమలు కోసం, కార్మిక హక్కులు కాపాడుకోవడం కోసం, కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. వ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బాబురావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేసిన అంగన్వాడీలు

భోగాపురం: ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని అంగన్వాడి యూనియన్ నాయకులు సోమవారం సమ్మె నోటీసును అందజేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అవలంబిస్తున్న విధివిధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త సమ్మెను ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తోంది. ఈ సమ్మెలో అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు పాల్గొంటామని ముందస్తుగా నోటీసులు అందజేశారు. అంగన్వాడి యూనియన్ నాయకులు శ్రీదేవి, అనిత, ప్రవీణ పాల్గొన్నారు.

పూసపాటిరేగ: సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన జీపు జాతా సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టివి రమణ మాట్లాడుతూ కార్మికులంతా ఈ నెల 20 జరగనున్న సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా అధ్యక్షుడు పి.శంకర్రావు పూసపాటి రేగ సిఐటియు నాయకుడు బి.సూర్యనారాయణ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సుబ్బలక్ష్మి అంగన్వాడీ యూనియన్ నాయకులు ఈశ్వరమ్మపాల్గొన్నారు.

విజయనగరం : సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మైనింగ్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయండి

విజయనగరం టౌన్ : ప్రభుత్వ రంగ పరిరక్షణ, కనీస వేతనాలు అమలు కోసం, కార్మిక హక్కులు కాపాడుకునేందుకు, కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం తోటపాలెం ఎల్‌బిజి భవనంలో కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాడు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం 4 కోడ్‌లుగా మార్చిందన్నారు. ఐఎఫ్‌టియు, ఎఐఎఫ్‌టియు, ఎఐఎఫ్‌టియు (న్యూ) అప్పలసూరి, అప్పలరాజు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాస్ మాట్లాడారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని, రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మె జరుగుతోందన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్రావు మాట్లాడుతూ సమ్మె జయప్రదానికి బుధవారం సాయంత్రం 4గంటలకు కోట వద్ద సభ, 18న ఉదయం 9 గంటలకు పాట నుంచి బైక్ ప్రదర్శన జరుగుతుందని, మే 20 విజయనగరం ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ నుంచి ప్రదర్శన, కోట వద్ద సభ జరుగుతుందని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె గోడ పత్రికను ఆవిష్కరించారు. అసంఘటితరంగా కార్మిక హక్కుల సాధన సమితి కన్వీనర్ బి.గిరి ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు బి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలతో వాగ్వివాదం

మండల సమావేశంలో రసాభాస

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సర్వసభ్య సమావేశంలో వైసిపి కూటమి నాయకుల మధ్య జరిగిన వ్యక్తిగత దూషణలు బాహాబాహీకి దారి తీశాయి. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మహంతి కళ్యాణి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి హాజరయ్యారు. ఆర్అండ్‌బి రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయంటూ సమావేశంలో వైసిపి నాయకుడు, పతివాడ ఎంపిటిసి పతివాడ అప్పలనాయుడు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన ఆయనే రోడ్ల ఆక్రమణకు పాల్పడుతున్నాడంటూ ఎమ్మెల్యేకు రెల్లివలస సర్పంచ్ భర్త ఇజ్జురోతు అప్పలరాజు చెప్పారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం జరుగుతుండగా సర్పంచ్ భర్త ఈశ్వరరావు సమావేశంలోకి రావడంతో వైసిపి నాయకులు కూడా లోపలికి వచ్చేశారు. దీంతో ఎంపిపి కళ్యాణి కలగు చేసుకుని సభ్యులు కాని వారు బయటకు వెళ్లిపోవాలని చెప్పారు. సమావేశం నుండి వెళ్ళిపోతుండగా ఎంపిపి భర్త మహంతి శ్రీనివాసరావు సభ్యులు కాని వారు సమావేశంలోకి ఎలా వెళ్తారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెల్లివలస సర్పంచ్ భర్త ఈశ్వరరావు, జనసేన నాయకులు పతివాడ శ్రీను ఎంపిపి భర్త శ్రీనివాసరావుతో వాగ్వివాదానికి దిగారు. వ్యక్తిగత దూషణలకులకు పాల్పడడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎంపిపి లేని సమయంలో ఏ సభ్యుడు కాని నువ్వు ఎలా ఎంపిపి రూమ్‌లో ఉంటున్నావ్ అంటూ జనసేన నాయకుడు పతివాడ శ్రీను ప్రశ్నించారు. ఇలా ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలతో మండల పరిషత్ కార్యాలయం దద్దరిల్లింది. సర్వసభ్య సమావేశంలోకి వచ్చి అసభ్యకర పదజాలంతో వాగ్వివాదానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపిపి మహంతి కళ్యాణి ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కూటమి నేతలు ఎంపిపి లేని సమయంలో ఎంపిపి భర్తకు చాంబర్లోకి అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. ఎంపిడిఒ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

సభ్యులను అదుపు చేస్తున్న పోలీసులు

వీధి విక్రయదారుల సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర వ్యాప్తంగా వీధివిక్రయదారులను గుర్తించే సర్వే ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ప్రతి సచివాలయ పరిధిలో ఆయా ప్రాంతాలలో ఉన్న వీధివిక్రయదారులను ప్లానింగ్, ఎమినిటీస్ కార్యదర్శులు గుర్తించే చర్యలను ప్రారంభించారు. ప్రతి వీధిలో పర్యటించి వీధి విక్రయదారులు, వారి పరిస్థితుల వివరాలను అడిగి తెలుసుకుని నమోదు చేస్తున్నారు. నగరంలో రెడ్, గ్రీన్, అంబర్ జోన్లు ఏర్పాటు చేయనున్నారు. రెడ్ జోన్‌లో వీధివిక్రయాలు పూర్తిగా నిషేధం మని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. గ్రీన్ జోన్‌లో వీధివిక్రయాలు కొనసాగించుకోవచ్చు అని తెలిపారు. అంబర్ జోన్లో నిర్ణీత కాల వ్యవధిలో మాత్రమే వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు.

రెండు బుట్టల విధానాన్ని పాటించాలి

నగర ప్రజలు తప్పనిసరిగా రెండు బుట్టల విధానాన్ని అవలంభించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం ఆయన పలు ప్రాంతాలలో పర్యటించారు. చెత్త తరలించే వాహనాలు నిర్ణీత సమయానికి వస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. ఇంటింటి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. తడి చెత్త పొడి చెత్తలను వర్గీకరించి తమ వద్దకు వచ్చే చెత్త తరలించే వాహనాలకు అందివ్వాలని సూచించారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు బుధవారం నుంచి ఆక్రమణలు తొలగించనున్నామని తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. ఇప్పటికే దురాక్రమణ చేసిన స్థలాల్లో రెడ్ మార్కు వేశామన్నారు. రోడ్డు మధ్య నుంచి 50 అడుగులు ఇరువైపులా తొలగిస్తామని తెలిపారు. ఈ రోడ్డు ఆక్రమణ కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆర్అండ్‌బి, పోలీసు అధికారుల సమన్వయంతో పక్కాగా తొలగింపు చర్యలకు సిద్ధంగా ఉన్నామన్నారు. దీనికి వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. స్వచ్ఛందంగా తొలగిస్తే మంచిదని, లేకపోతే జెసిబిల ద్వారా తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామని తేల్చిచెప్పారు.

బుద్ధుని బోధనలు ఆచరణీయం

ప్రజాశక్తి-వేపాడ

బుద్ధుని బోధనలు ఆచరణీయమని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు అన్నారు. మండలంలోని సింగరాయి గ్రామంలో సోమవారం రమాబాయి మహిళా సంఘం, అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌతమ బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జామి దేముడు, రిక్కి సన్యాసమ్మ, గొల్ల అవతారం, రిక్కి కృష్ణమ్మ, వసంత, నాగమ్మ, భాను, దేవుడమ్మ, ముత్యాలమ్మ, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : బుద్ధుడు బోధించిన శాంతి, సామరస్యాలే నేటి సమాజానికి శిరోధార్యమని రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు అన్నారు. బొబ్బిలి మండలం కునుకువానివలసలో విశ్రాంత ఉపాధ్యాయులు చప్ప అప్పలనాయుడు ఏర్పాటుచేసిన బుద్ధుని విగ్రహం వద్ద బుద్ధ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. బుద్ధుని విగ్రహానికి జెసి రాజు పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం నిర్వాహకులు చప్ప అప్పలనాయుడు, సమరస సేవా సమితి అధ్యక్షులు ధూపం వాసు జెసి రాజును సత్కరించి జ్ఞాపికను అందించారు.

బుద్ధుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే కోండ్రు

తాగునీటి సమస్యపై నిరసన సెగ

ప్రజాశక్తి- రేగిడి

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్ళు వంటివని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం పెదశిర్లాం గ్రామానికి రూ. 1.10 కోట్లు, చిన్నయ్యపేటకు రూ. 1.56 కోట్లు, దేవుదల పంచాయతీ గోపెంపేటకు రూ. 46 లక్షలు, అంబకండికి రూ. 70 లక్షలతో మంజూరైన బిటి రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితో పాటు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలానికి మరో రూ.5 కోట్లు బిటి రోడ్లు, సిసి రోడ్లుకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. తోటపల్లి, మడ్డువలస పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఖరీఫ్ వ్యవసాయానికి ప్రాజెక్టుల ద్వారా సకాలంలో సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. 800 కోట్లుతో ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా నీరు అందిస్తామన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు ప్రతి ఎకరాకూ నీరు అందించి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోండ్రు జగదీష్, కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, నారు జనార్ధనరావు, సవిరిగాన సింహాచలం, కె.రమణ, గంగు కృష్ణ, గురవాన నారాయణ రావు, పాలవలస రామచంద్రి నాయుడు జనసేన నాయకులు యుపి రాజు, మండల నాయకులు మామిడి ఆనందరావు, రెడ్డి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నిరసన సెగ

మండలంలోని దేవుదల గ్రామంలో గత రెండేళ్ల నుంచి తాగునీటి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే కోండ్రు మురళి మోహన్ ఎదుట నిరసన తెలిపారు. దేవుదల, గోపెంపేట బీటీ రోడ్లు భూమి పూజ చేసిన అనంతరం సభ నిర్వహించారు. ఈ సభలో తమ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని, గుక్కెడు నీటి కోసం పొలాల్లో ఉన్న నీటి బావులను ఆశ్రయించవలసిన పరిస్థితి ఉందని కరణం సరోజిని, రమాదేవి, కళావతి, ధనలక్ష్మి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటికి కుళాయి అన్నారని, నేటి వరకు ఎటువంటి కొళాయి నిర్మాణాలు చేపట్టలేదని నిరసన తెలిపారు. వారానికి రెండుసార్లు వచ్చే కొద్దిపాటి నీరుతోనే కాలం గడుపుతున్నామని పూర్తిస్థాయిలో తాగునీరు ఇప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి ఇబ్బందులు తీర్చకుంటే మండల, జిల్లా కలెక్టరేట్‌లో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తామని గ్రామస్తులు వెల్లడించారు.

ఎమ్మెల్యే వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఇ-గేమ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి జిఎస్ఎన్‌రాజు, రిజిస్ట్రార్ జయసుమ, ఝాన్సీలక్ష్మి

సీతం కళాశాలలో 'ఇ-గేమ్' పుసకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

వినూత్నంగా ఇంగ్లీష్ నేర్చుకునే మార్గం.. ఈ-గేమ్ ఏ డిఫరెంట్ అప్రోచ్ టు లెర్న్ ఇంగ్లీష్ విత్ ఫన్' పుస్తకావిష్కరణ కార్యక్రమం సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, సీతం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, జెఎన్‌టియు జివి రిజిస్ట్రార్ డాక్టర్ జయసుమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ, ఈ పుస్తకం విద్యార్థులలో ఇంగ్లీష్ భాషాపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసి, ప్రపంచ స్థాయిలో పోటీతత్వం కలిగించగలదని తెలిపారు. డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఇంగ్లీష్ భాష అనివార్యమని, ఈ పుస్తకం ద్వారా అలవోకగా నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ పుస్తకాన్ని అందరికీ అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ జయసుమ గారు విద్యార్థులు ఈ పుస్తకాన్ని చదివితే ఉద్యోగ అవకాశాల విషయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపల్ డి.వి. రామమూర్తి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-రామభద్రపురం

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రసాదరావు హెచ్చరించారు. ఆదివారం రాత్రి కొండకెంగువలో ఇరుగ్రూపుల మధ్య వివాదం... కొట్లాటకు దారితీసింది. దీనిపై ఆ గ్రామస్తులను, పెద్దలను సోమవారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. యువత మద్యానికి బానిసై కొట్లాటలో పాల్గొంటే జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. ముఖ్యంగా కొండకెంగువ గ్రామంలో యువత చెడు వ్యసనాలకు బానిసై తరచూ ఘర్షణలకు దిగడంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇప్పటికైనా గ్రామస్తులు ఐకమత్యంతో ఉండాలని సూచించారు.

కొత్త భవనాలు మంజూరు చేయండి

మంత్రి లోకేష్‌ను కోరిన రామ్‌మల్లిక్‌నాయుడు

ప్రజాశక్తి - చీపురుపల్లి

నియోజకవర్గంలో ఉన్న చీపురుపల్లి, గరివిడి, మెరకముడుదాం, గుర్ల మండలాలలో సుమారు 21 పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉండవల్లిలో గల లోకేష్ నివాసంలో రామ్‌మల్లిక్ నాయుడు లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గల పలు సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. తోటపల్లి కాలువ పూడికతీతతో పాటు కాలువ పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రధానంగా నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఎక్కువగా ఉండడంతో ఉపాధి కల్పించడంలో భాగంగా నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని లోకేష్‌కి విజ్ఞప్తి చేశారు..

మంత్రి లోకేష్‌తో రామ్‌మల్లిక్‌నాయుడు

జగ్గయ్యపేటలో పండగ సందడి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేటలో గ్రామదేవత పైడితల్లమ్మ పండగ సందడి ఆరంభమైంది. సోమవారం తొలేళ్ల సంబరం నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఉత్సవ విగ్రహాన్ని, ఘటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, కాంగో నృత్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వంటాకు రామయ్యమ్మ, ఉపసర్పంచ్ వంటాకు శ్రీను, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-తెర్లాం

విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని ఆమిటి సీతారాంపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సాగర్‌బాబు కథనం ప్రకారం... కొత్తకోట చిరంజీవి (20) అనే యువకుడు టెంట్‌హౌస్ నడుపుతున్నాడు. అందులో భాగంగా ఒక శుభకార్యం అనంతరం లైటింగ్, పెండాలు తీస్తున్నాడు. ఇంతలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు.

రెండు ఆవులు సజీవ దహనం

ప్రజాశక్తి-వేపాడ

మండల కేంద్రమైన వేపాడకు చెందిన నిరుజోగి కృష్ణ పశువుల శాల అగ్నిప్రమాదంలో ఆదివారం రాత్రి రెండు గంటల సమయంలో దగ్ధమైంది. పశువుల శాలలో ఉన్న రెండు ఆవులు సజీవ దహనమయ్యాయి. ఘటనా స్థలాన్ని ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.సన్యాసినాయుడు, విఆర్‌ఒ కొండమ్మ, విశాఖ డెయిరీ మేనేజర్, సూపర్‌వైజర్ పరిశీలించారు. మరణించిన ఆవుల విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఆవులకు బీమా సౌకర్యం ఉన్నట్లు వారు తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గంజాయి తరలిస్తున్న కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గతేడాది నవంబర్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేసులో శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన శృంగారపు దిలీప్, ఒడిశాకు చెందిన సిబారం పట్నాయక్ ఇద్దరు నిందితులని తెలిపారు. సోమవారం రైల్వేస్టేషన్ పాత క్వార్టర్స్ వద్ద వారిని పట్టుకుని వారి వద్ద ఉన్న రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వారిని రిమాండ్‌కు తరలించామని, ఇద్దరికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని చెప్పారు.